# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

శనివారం 8-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial


## నాన్న కల నెరవేరుస్తా.. షర్మిల

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 8)**



వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతిని పురస్కరించుకుని కుమార్తె షర్మిల ఇడుపుల పాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె ఎమోషన్ అయ్యారు. ప్రస్తుతం వైఎస్ఆర్‌టీపీ అధినేత్రిగా తెలంగాణ రాజకీయాల్లోకి ప్రవేశంచిన ఆమె ఇక్కడి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఆమె ఓ సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు. ''నాన్న ఈ లోకాన్ని వదిలి వెళ్లినా.. ప్రతి పేదవాడి చిరునవ్వులోనూ నాన్న బతికే ఉన్నారు. రైతులు, ఆడబిడ్డల అభ్యున్నతి కోసం నాన్న కన్న ప్రతి కల .. నేను నెరవేరుస్తా'' అని షర్మిల పేర్కొన్నారు.







లేటెస్ట్ న్యూస్

# వరంగల్‌లో ప్రధాని

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**తెలుగుప్రభ, వరంగల్ (జూలై 8)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దాదాపు ముప్పై ఏళ్ల వరంగల్‌లో అడుగు పెట్టడం ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్ నుంచి నేరుగా వరంగల్ మామునూరు చేరుకున్న ప్రధాని మోదీ.. భద్రకాళీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆరట్స్ కాలేజీ మైదానానికి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా ఆయన రూ.6,109 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రతిష్ఠాత్మక వ్యాగన్ తయారీ పరిశ్రమ, ఇంకా పలు జాతీయ రహదారులకు భూమి పూజ చేశారు. అనంతరం హన్మకొండలో జరిగిన విజయ సంకల్పసభలో ప్రసంగించారు.

'తెలంగాణ ప్రజలందరికీ నా అభినందనలు' అంటూ తెలుగులో ఆయన ప్రసంగం మొదలుపెట్టారు. దేశ అభివృద్ధిలో తెలంగాణ భాగస్వామ్యం ప్రముఖమైనదని, ఎన్నో పరిశ్రమలకు తెలంగాణ వేదికగా మారిందన్నారు. తొమ్మిదేళ్ల క్రితమే రాష్ట్రం ఏర్పడినప్పటికీ దేశాభివృద్ధిలో గొప్ప చరిత్ర ఉందన్నారు. ఇక్కడకు పెట్టుబడులు తరలివస్తున్నాయని తెలిపారు. అందుకే తాము ఇక్కడి అభివృద్ధికి ప్రధానంగా దృష్టి కేంద్రీకరించినట్లు చెప్పారు.

పనిలో పనిగా బీఆర్ఎస్‌పై వ్యంగాస్త్రాలు సంధించారు. తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు నాలుగు పనులే చేసిందని ప్రధాని మోదీ అన్నారు. 'మొదటిది ఉదయం నుంచి సాయంత్రం వరకు మోదీని తిట్టడం. రెండోది కుటుంబ పార్టీని పెట్టి పోషించడం. మూడోది తెలంగాణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడం. నాలుగో పని తెలంగాణను అవినీతిలో కూరుకుపోయేలా చేయడం. తెలంగాణలో అవినీతి లేని ప్రాజెక్ట్ లేదు. వీళ్ల అవినీతి దేశస్థాయికి చేరింది' అని పేర్కొన్నారు.

తెలంగాణలో బీజేపీకి రెండే సీట్లు ఉన్నప్పుడు ఒక్కటి హన్మకండలోనే అన్నారు. వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో కూడా ట్రైలర్ చూపించామన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపని ఈ సభను చూస్తే అర్థం అవుతోందని చెప్పారు. పర్యటనలో ప్రధాని వెంట కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితర ముఖ్య నేతలు

## మోదీకి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై8)**

ఓవైపు.. తెలంగాణకు ఏమీ ఇవ్వని మోదీ కార్యక్రమాల్ని తాము బహిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు స్పష్టం చేయగా, మరోవైపు.. 'నేను వరంగల్ – నాది తెలంగాణ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు వరంగల్‌లో మోదీ రాకను నిరసిస్తూ ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేశారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు నెరవేరలేదని ఆయా మార్గాల్లో వీటిని ఏర్పాటు చేశారు. మోదీజీ.. ఎక్కడ గిరిజన యూనివర్సిటీ, మామ్నూర్ ఎయిర్‌పోర్టు, బయ్యారం స్టీల్‌ఫ్యాక్టరీ.. ?అంటూ ఒక్కో పోస్టర్‌పై ఒక్కో హామీని గుర్తుచేస్తూ ప్రదర్శించారు. రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ తదితరమైనవి కూడా వీటిల్లో ఉన్నాయి. మరోవైపు ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సిందిగా ములుగులో కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు నిరసన దీక్ష




ప్రారంభించారు.

# బెంగాల్‌లో హింస

## 9 మంది మృతి .. ఎన్నిక ఏదైనా అదే సీన్!

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 8)**

పంచాయతీ ఎన్నికల వేళ బెంగాల్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. హింస చెలరేగింది. అధికార, విపక్షాల మధ్య అల్లర్లు చోటుచేసుకున్నాయి. ఏకంగా నలుగురు టీఎంసీ కార్యకర్తలు, సహా మొత్తం 9 మంది వేర్వేరు ప్రాంతాల్లో హత్యకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. అదనపు బలగాలను రంగంలోకి దింపి పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తోంది. అధికార టీఎంసీ కార్యకర్తల దాడులపై కాంగ్రెస్, కమ్యూనిస్టులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. అధికార పార్టీ కార్యకర్తలు ఎక్కడికక్కడ రెచ్చిపోతున్నారని, తమపై దాడులకు దిగుతున్నాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

బెంగాల్లో పంచాయతీ ఎన్నికల పోలింగ్ మొదలైంది. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని 5.6 కోట్ల మంది ప్రజలు ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. బెంగాల్లోని ముర్షిదాబాద్ జిల్లాలో తీవ్ర హింసాకాండ చోటు చేసుకుంది. కపస్‌దంగా ప్రాంతంలో టీఎంసీ కార్యకర్త బాబర్ అలీ హత్యకు గురయ్యాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన అతన్ని బహరంపూర్‌లోని ముర్షిదాబాద్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ముర్షిదాబాద్ జిల్లాలోని రెజీనగర్‌లో శుక్రవారం జరిగిన నాటు బాంబు పేలుడులో ఒక టిఎంసి కార్మికుడు చనిపోయాడు. జిల్లాలోని ఖర్‌గ్రామ్‌లో మరో తృణమూల్ కార్యకర్తను కత్తితో పొడిచి చంపారు.



తూర్పు మిడ్నాపూర్‌లోని సోనాచురా గ్రామపంచాయతీకి చెందిన తృణమూల్ బూత్ ప్రెసిడెంట్ దేవ్‌కుమార్ రాయ్‌పై బీజేపీ కార్యకర్త సుబల్ మన్నా, అతని అనుచరులు దాడి చేశారు. జ్వగురిలో తృణమూల్ అభ్యర్థిపై బీజేపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. హింసాకాండ మధ్య రాష్ట్రంలో కేంద్ర బలగాలను మోహరించాలని డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష పార్టీలపై టీఎంసీ ఇప్పటికీ విరుచుకుపడుతోంది. మరోవైపు కూచ్ బెహార్‌లోని రాంపూర్‌లో గణేష్ సర్కార్ అనే టీఎంసీ బూత్ కమిటీ ఛైర్మన్‌ను కత్తితో పొడిచి చంపారు. ఈ ఘటన నిన్న అర్ధరాత్రి చోటుచేసుకుంది. సర్కార్‌ను అలీపుర్‌దువార్‌లోని ఆసుపత్రికి తరలించారు, అక్కడ అతను చనిపోయినట్లు ప్రకటించారు. మరొక ఘటనలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) కార్యకర్త హఫీజుర్ రెహమాన్‌పై కాల్పులు జరపడంతో గాయపడ్డారు. కూచ్ బెహార్ జిల్లాలోని ఓక్రాబరి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది.



## ఇదేం పైత్యం..

### సజ్జనార్ ఫైర్

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 8)**

పోలీసు అధికారిగా సంచలనాలు సృష్టించిన సజ్జనార్ సామాజిక అంశాలపై నిత్యం స్పందిస్తున్నారు. ఆర్టీసీకి బదిలీ అయ్యాక సంస్థలో విప్లవాత్మక మార్పులు చేశారు. తనదైన శైలిలో ముందుకు వెళ్తూ సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తున్నారు. విధి నిర్వహణలో బిజీగా ఉంటూనే సామాజిక అంశాలపై స్పందిస్తున్నారు. తాజాగా కొందరు యువకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ''సోషల్ మీడియాలో వైరల్ అయితే అదేదో గొప్పగా ఫీలవుతున్నారు. అందుకోసం వింత వింత చర్యలకు పాల్పడి ఇలా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సోషల్ మీడియాలో వైరల్ కన్నా.. మీ ప్రాణాలు ఎంతో విలువైనవి. పిచ్చి పిచ్చి పనులు చేసి జీవితాన్ని నాశనం చేసుకోకండి. మీ కుటుంబానికి శోకాన్ని మిగల్చకండి.'' అని సూచిస్తూ ఇదే పైత్యం అని పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

**తెలుగుప్రభ, ఆదిలాబాద్ (జూలై 8)**




ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఐదుగురికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఒక ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. గాయాలపాలైన వారికి ఆస్పత్రికి తరలించారు. మృతులను పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులందరూ ఆదిలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. వారి వివరాల ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందిస్తున్నారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాలను కుటుంబసభ్యులకు అందించనున్నారు. క్షతగాత్రులకు వైద్యులు చికిత్స అందిస్తుండగా.. అందులో కొంతమంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఆదాయ పన్ను శాఖ వార్నింగ్

### తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన శిక్ష




**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 8) : ఐటీ రిటర్న్ కోసం తప్పడు పత్రాలు సమర్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదాయ పన్ను శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, నిఘా పెంచామని వెల్లడిస్తున్నారు. ఐటీరిటరన్స్ దాఖలు చేసేప్పుడు క్లెయిమ్ కోసం తప్పుడు సమాచారం పొందుపర్చినా, అర్హతలేని మినహాయింపులు కోసం తప్పుడు డాక్యుమెంట్లు సబ్మిట్ చేసిన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఐటీశాఖ ఏపీ తెలంగాణ రీజియన్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత హెచ్చరించారు. ఇలా చేసిన టాక్స్‌పేయర్స్‌కు శిక్షపడుతుందని మధుమిత తెలిపారు. తప్పుడు క్లెయిమ్స్ చేసిన వారు 12శాతం వడ్డీతో పాటు 200శాతం వరకు ఫైన్ వసూలు చేయడం, రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించే ఛాన్స్ ఉందని స్పష్టం చేశారు. రెండే తెలుగు రాష్ట్రాల్లో ఉండే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తప్పుడు డాక్యుమెంట్స్ పొందుపర్చి రీఫండ పొందినట్లు ఐటీశాఖ గుర్తించింది. ఐటీ రిటరన్స్ తప్పుగా సమర్పించి రీఫండ పొందిన వారి సంఖ్య లక్షల్లో ఉంటుందని వెల్లడించారు.**



## జూబ్లీహిల్స్‌లో మరో కారు బోల్తా

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై8)**

జూబ్లీహిల్స్‌లో నిన్న రోడ్డు డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడిన ఘటన మరువక ముందే ఇవాళ మరో కాడు డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురైంది. జూబ్లీహిల్స్ రోడ్‌నెంబర్ 45లో గీతా ఆరట్స్ కార్యాలయం ఎదురుగా ఈ ప్రమాదం జరిగింది. అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు పల్టీ కొట్టింది. ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని భావిస్తున్న పోలీసులు మద్యం సేవించి ఉంటాడనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## అమరావతి రైతులకు ఏపీ సర్కారు తీపి కబురు

**తెలుగుప్రభ, అమరావతి (జూలై 8)**



అమరావతి రైతులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చినందుకు ప్రతిగా వారికి చెల్లిస్తున్న వార్షిక కౌలు నిధులను విడుదల చేసినట్లు తెలిపింది. ప్రభుత్వం హైకోర్టుకు కీలక సమాచారం ఇచ్చింది. ఇప్పటికే రూ.200 కోట్ల కౌలు బకాయిల మొత్తాన్ని జమ చేశామని, త్వరలోనే ఇది రైతుల ఖాతాలకు చేరుతుందని వెల్లడించింది.